క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామికి పూజలు, పల్లకి సేవ గావించారు. రాత్రి 7 గంటలకు గ్రామోత్సవాన్ని మేళతాళాలు, బాణసంచాల వెలుగుల మధ్య వైభవంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



గంగాస్నానం సందర్భంగా చేస్తున్న పూజలు

పొదలకూరు : పట్టణంలోని పద్మావతినగర్ భక్తబృందం యువకులు నెలరోజుల పాటు పండరి భజనలో శిక్షణ పొంది మంగళవారం అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొన్నారు. తొలుత ఉదయం 7.30 గంటలకు గంగాస్నానం, 9.30 గంటలకు కంకణధారణ, సాయంత్రం 4.30 గంటలకు అగ్నిప్రతిష్ఠ, రాత్రి 9 గంటలకు పండరిభజన, వేకువజామున నరసింహస్వామి దండకము, అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఇనుకుర్తికి చెందిన భజన గురువు ప్రభాకర్‌దాస్ నెలరోజుల పాటు యువకులకు శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పెద్ద గురువు చీర్ల శ్రీనివాసదాస్ పాల్గొని పర్యవేక్షించారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

మనుబోలు : మండలంలోని వడ్లపూడి గ్రామంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. గ్రామదేవత పొన్నూరమ్మ దేవాలయంలో వంటశాలను ప్రారంభించిన సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో వడ్లపూడి, గొట్లపాళెం గ్రామాలకు చెందిన పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రక్తనిధి జిల్లా మోటివేటర్ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు సిటీ: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. లేక్‌వ్యూ కాలనీలోని తొమ్మిదో వీధిలో నూర్జహాన్, ఆమె కుమారుడు మసూమ్ నివాసం ఉంటున్నారు. విభేదాల కారణంగా మసూమ్ దంపతులు కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నారు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఆయన పనులకు సైతం వెళ్లకుండా తల్లితో ఉంటున్నారు. వారి ఇంటి సమీపంలోని డ్రైవర్ అంకయ్య తన లారీలో క్లీనర్‌గా మసూమ్‌ను చేర్చుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల ఏడున వీరిద్దరూ వెళ్లారు. పదో తేదీన ఇంటికి అంకయ్య చేరుకోగా, తన కుమారుడు రాకపోవడంతో మసూమ్ తల్లి ప్రశ్నించారు. బంగారుపేట వద్ద కాలకృత్యాలకు వెళ్లిన మసూద్ తిరిగి రాలేదని, చాలాసేపు చూసి ఎంతకీ రాకపోవడంతో నెల్లూరుకు తిరిగొచ్చానని అంకయ్య తెలిపారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గరుడ వాహనంపై మహావిష్ణు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో కొలువైన మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గరుడవాహనంపై మంగళవారం కొలువుదీరారు. అయ్యప్పస్వామి దేవస్థానం నుంచి నిప్పో సెంటర్ వరకు.. అక్కడి నుంచి ప్రధాన మార్గంలో నగరోత్సవం సాగింది. మహాకుంభారాధన, నిత్యహోమం, శాత్తుమొరై, హయగ్రీవ హోమం, ఉత్సవమూర్తులకు అభిషేకం, ధన్వంతరి, అష్టాక్షరి హోమాలను విశేషంగా నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత మహావిష్ణుకు తిరుమంజనం, సహస్రనామార్చనలను ఉదయం జరిపారు.

ప్రగతి పథంలో పల్లెలు

- ఏడాది క్రితం నుడా పరిధిలోకి మండలం
- పక్కా గృహాల మంజూరుకు లైన్‌క్లియర్
- నుడా నిధులతో అభివృద్ధి పనులు

రెవెన్యూ విలేజీలు	36
మొత్తం గ్రామాలు	52
మండల జనాభా	68,148
పురుషులు	34,215
స్త్రీలు	33,933
అక్షరాస్యతా శాతం	70.21



వరదాపురం గిరిజన కాలనీలో నుడా నిధులతో నిర్మించిన రోడ్డు

పొదలకూరు : మండల పరిధిలో సంక్షేమ అమలు, ప్రగతి పనులు పరుగులు తీస్తోంది. నియోజకవర్గంలో పెద్ద మండలమైన పొదలకూరును తొలిసారి నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) కిందకు తీసుకోలేదు. దీంతో మండలంలో పక్కా ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబాటు తనం కనిపించింది. జగనన్న కాలనీలకు సైతం ఇళ్ల మంజూరులో వెనుకబడడంతో స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంత్రి అయిన కొద్దిరోజులకే గతేడాది జూన్ మాసంలో మండలాన్ని నుడా పరిధిలోకి తీసుకొచ్చారు. ఫలితంగా మండలానికి ఆరు వేల పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. దీంతో గ్రామాల్లో ఇళ్లను మంజూరు చేసి నిర్మిస్తున్నారు. అయితే ఉన్నత స్థాయి అధికారులు మండలంలోని కొన్ని గ్రామాలను మాత్రమే నుడా కిందకు తీసుకుంటామని వెల్లడించినా మంత్రి పట్టుబట్టి మండలంలోని మొత్తం 36 రెవెన్యూ గ్రామాలను నుడా పరిధిలో చేర్పించారు. ఫలితంగా పక్కా ఇళ్ల మంజూరు, అభివృద్ధి పనులకు లైన్‌క్లియర్ అయ్యింది.

నుడా వల్ల ఉపయోగాలు

నుడాలో మండలం కలిసిపోవడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. మున్సిపాలిటీకి చేరువగా ఉన్న పొదలకూరుపై పన్నులు భారం పడకుండా మంత్రి కాకాణి మేజర్ పంచాయతీగానే ఉంచారు. అయితే పట్టణంతో పాటు, గ్రామాల అభివృద్ధి కోసం మండలాన్ని నుడా పరిధిలోకి తీసుకొచ్చారు.



జగనన్న లేఅవుట్

ఈ నేపథ్యంలో అవసరమైనన్ని పక్కా ఇళ్ల మంజూరుతో పాటు, జగనన్న కాలనీల్లో పేదలు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. అభివృద్ధి పనుల కోసం నుడా నుంచి నిధులను కూడా కేటాయిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే లేఅవుట్లు పక్కాగా ఉండడంతో పాటు నుడా కింద పని చేసే టౌన్‌ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో లేఅవుట్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందువల్ల నుడాకు ఆదాయంలో పంచాయతీలకు 50 శాతం భాగస్వామ్యం కల్పిస్తారు. ప్రధానంగా పొదలకూరు పట్టణంలో మౌలిక వసతులు పెరుగుతాయి.

రోడ్లు, డ్రెయిన్లకు నుడా నిధులు

మంత్రి కాకాణి 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించిన సందర్భంగా అత్యవసరంగా రోడ్లు,



గ్రామాల్లో నిర్మిస్తున్న సైడ్‌డ్రెయిన్లు

డ్రెయిన్ల కోసం నుడా నుంచి నిధులను సాధించారు. ఇందులో వరదాపురానికి సమీపంలో రుస్తుం మైన్ వద్ద ఉన్న గిరిజనకాలనీ వాసులకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుంటే మంత్రి కాకాణి గుర్తించి రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షల నుడా నిధులను కేటాయించారు. పొదలకూరు పట్టణంలో శ్రీనివాస లేఅవుట్‌లో వెంకటేశ్వర స్వామి దేవస్థానం రోడ్డుకు రూ.20 లక్షల నుడా నిధులను వెచ్చించారు. గ్రామాల్లో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణానికి కూడా నిధులను కేటాయించారు.

నుడాలో చేర్చడం మంచిదే



పొదలకూరు మండలాన్ని నుడాలో చేర్చడం మంచిదే. అర్బన్ డెవలప్‌మెంట్ కింద నిధులు మంజూరు అవుతాయి. ఈ ప్రాంత వాసులకు ఏమి అవసరమో మంత్రి కాకాణికి బాగా తెలుసు. మారుమూల గ్రామాలు కూడా అభివృద్ధి చెందడం గొప్పవిషయం.

– పి.లచ్చారెడ్డి, ఉపసర్పంచ్, తాటిపర్తి

పనుల్లో వేగం పెరుగుతుంది



మండలాన్ని నుడాలో చేర్చడం వల్ల అభివృద్ధి పనుల్లో వేగం పెరిగింది. పక్కా ఇళ్ల మంజూరు సమస్య పూర్తిగా తీరింది. నుడా నిధులతో అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయి.

– వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్, పొదలకూరు

పంచాయతీలకు నుడా నిధులు



పట్టణ, గ్రామాల్లో ఏర్పాటు చేసే ప్రైవేటు లేఅవుట్లు, భవన నిర్మాణాలు తదితర ఆదాయంలో నుడా నుంచి పంచాయతీలకు భాగస్వామ్యం ఉంటుంది. టౌన్‌ప్లానింగ్ అధికారి ద్వారా పెద్ద భవంతుల నిర్మాణం జరుగుతుంది. లేఅవుట్లు నుడా నిబంధనల ప్రకారం నిర్మించాల్సి ఉంటుంది.

– ఎస్‌కే అల్లాభక్షు, పంచాయతీ సెక్రటరీ, పొదలకూరు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం



వాటర్ కూలర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కోవూరు శాంతి నగర్, కొత్తూరు రామమందిరం ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని స్థానికులను ఆరాతీశారు. కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీలు పూడిక తీయాలని ప్రజలు కోరడంతో తక్షణమే ఇరిగేషన్ ఏఈని పిలిచి కాలువకు పూడిక తీయాలన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి నీరు నిలబడకుండా పూడికతీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని తెలియజేశారు. ప్రతి ఇంటి వద్ద సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ఎంతో సంతోషంతో స్వాగతం పలుకుతున్నారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు.

వాటర్ కూలర్ వితరణ

కోవూరు సచివాలయం–3 కేంద్రానికి వైఎస్సార్‌సీపీ నేత పుచ్చలపల్లి వెంకటరమణారెడ్డి తన సొంత ఖర్చులతో రూ.40 వేల విలువ చేసే వాటర్ కూలర్‌ను వితరణగా అందించారు. దీనిని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, పార్టీ యువజన విభాగం నేతలు వెంకటరమణారెడ్డి, అనూప్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో ప్రజలకు మేలు

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ద్వారా అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించి ప్రజలకు మేలు జరుగుతుందని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రీసర్వేకు సంబంధించిన డ్రోన్ యంత్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం రీసర్వే ప్రక్రియను తిలకించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రీసర్వే ద్వారా పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు భవనాల హద్దులకు సంబంధించిన సమస్యలు తొలగిపోతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హద్దుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన వారికి పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు షకీలా బేగం, మల్లారెడ్డి, స్థానిక నేత రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.



రీ సర్వే పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ, అధికారులు

సులభతరంగా ధ్రువీకరణ పత్రాలు

కొడవలూరు: సులభతరంగా జనన ధ్రువీకరణ పత్రాలు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకొందని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీలో ఎనిమిది మంది పిల్లల తల్లిదండ్రులకు జనన ధ్రువీకరణలు మంగళవారం ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు పిల్లల జనన ధ్రువీకరణల కోసం తల్లిదండ్రులు ఎంతగానో ఇబ్బంది పడేవారన్నారు. వాటికి క్లాం వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సులువుగా పొందేలా చర్యలు తీసుకొందని చెప్పారు. ఎక్కడి ఆస్పత్రిలో జన్మించినా క్షణాల్లో జనన ధ్రువీకరణ పొందే వెసులుబాటు కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్‌ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న పిల్లల తల్లిదండ్రులతో ఎంపీడీఓ, వైద్యాధికారులు

విద్యార్థులకు విద్యాకానుక

పొదలకూరు : పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేస్తున్నారని, గత ప్రభుత్వంలో పుస్తకాలు ఆరు మాసాలైనా అందేవి కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా రూపుదిద్దుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సనత్‌కుమార్, వార్డు సభ్యుడు కండే వాసుదేవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

మనుబోలు : భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉపకరిస్తాయని ఉప తహసీల్దార్ బాలకోటమ్మ అన్నారు. మండలంలోని వెంకన్నపాళెం సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై పలువురు రైతులు అధికారులకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు రైతులకు తెలిపారు. ఆర్‌ఐ శివప్రసాద్, వీఆర్వో భగవాన్, వీఆర్‌ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో అధికారులు

పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యం

మనుబోలు : పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ అన్నారు. మనుబోలు, బద్దెవోలు గ్రామాల్లో మంగళవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. రోడ్ల పక్కనున్న చెత్తను తొలగించి మురుగు కాలువల్లో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఉదయం నుంచి గ్రామాల్లో చెత్త తొలగించే కార్యక్రమాలు చేపడతున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం నుంచి గ్రామాల్లో ఉంటూ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణ, చెంచుప్రసాద్ పర్యవేక్షించారు.



మురుగు కాలువల్లో పూడిక తీస్తున్న కార్మికులు

నేడు వెంకటాచలంలో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య మంగళవారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలియజేశారు.

5,221 మందికి కిట్లు

ముత్తుకూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు విడుదలయ్యాయని మండల విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 5,221 మంది విద్యార్థులకు 5,221 విద్యాకానుక కిట్లు ఆయా పాఠశాలలకు చేరవేసినట్లు వెల్లడించింది.

నిద్రిస్తున్న వ్యక్తిపై కత్తితో దాడి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని గాంధీ నగర్‌కు చెందిన నాగలూరు వెంకటేశ్వర్లు తన ఇంట్లో నిద్రిస్తుండగా అదే ప్రాంతానికి చెందిన నక్క కృష్ణయ్యతో పాటు మరో వ్యక్తి కత్తితో దాడి చేశారు. ఈ ఘటన మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నాగులూరు వెంకటేశ్వర్లు తన ఇంట్లో నిద్రిస్తుండగా నక్క కృష్ణయ్య మరో వ్యక్తితో కలిసి వచ్చి దాడి చేశారు. దీంతో తీవ్రగాయాలైన వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే వెంకటేశ్వర్లు భార్య పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి దాడి చేసిన వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇందులో కృష్ణయ్య మాత్రం దొరకగా మరొకరు పరారయ్యారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందగా కేసు నమోదు చేశారు.

ముగిసిన బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంప్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల పాటు నిర్వహించిన ఉచిత వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దూడల సుధాకర్ అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు మాట్లాడారు. అండర్ – 17 రాష్ట్రస్థాయి పోటీలను ఈ సీజన్లో నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ అనుమతిచ్చారని తెలిపారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, వరప్రసాద్, కోచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



వెంకయ్యనాయుడుతో తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకుడు, కార్యనిర్వాహక సిబ్బంది

వెంకటాచలం: భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్‌కుమార్, కేంద్ర విద్యాత్మక కార్యనిర్వాహక సిబ్బంది వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సాహిత్యాల మీద జరుగుతున్న పరిశోధనల గురించి వెంకయ్యనాయుడు అడిగి తెలుసుకున్నారు. తెలుగు భాషా సాహిత్యాల ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని భవిష్యత్ పరిశోధకులకు, భాషాభిమానులకు అందించే విధంగా ఈ కేంద్రం తయారవ్వాలని సూచించారు. కేంద్రానికి అవసరమైన సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని పేర్కొన్నారు.

నిరుపయోగంగా ఈ–టాయిలెట్లు



పోలంరాజుగుంట పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ–టాయిలెట్



ముత్తుకూరు హైస్కూల్‌లో అమర్చిన ఈ–టాయిలెట్లు

- గత టీడీపీ పాలనా నిర్వాకం

ముత్తుకూరు : గత టీడీపీ పాలనలో హెచ్‌ఎంల అంగీకారం, ప్రమేయం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ–టాయిలెట్లు క్రమంగా నిరుపయోగంగా మారాయి. సుమారు ఆరేళ్ల క్రితం 2017లో ఓ కార్పొరేట్ సంస్థ ద్వారా మండలంలోని 20 పాఠశాలల్లో ఈ టాయిలెట్స్ పేరుతో ఎరుపు రంగు డబ్బాలు అమర్చారు. అయితే, విద్యార్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వీటిని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అతి సున్నితమైన ఈ టాయిలెట్స్‌కి నీటి సౌకర్యం కరువైంది. శుభ్రపరిచే పరిస్థితి లేకుండాపోయింది. దీనితో ఈ డబ్బాల నుంచి దుర్గంధం వ్యాపించడం మొదలైంది. దీని వల్ల ఉపయోగానికి బదులు దుర్వాసన అధికమవడంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వీటికి తాళాలు వేశారు. దీంతో క్రమంగా ఈ ఎరుపు డబ్బాలు అదృశ్యమయ్యాయి.

స్విమ్మింగ్‌లో జిల్లాకు పతకాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విజయవాడలో ఇటీవల నిర్వహించిన సీనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ఆరు పతకాలను జిల్లా క్రీడాకారులు సాధించారని ఆక్వాటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మధు, సనత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 మీటర్ల ఫ్రీ స్టయిల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల బటర్‌ఫ్లయ్ పోటీల్లో చరణ్‌కుమార్ నాలుగు స్వర్ణ, 1500 మీటర్ల ఫ్రీ స్టయిల్, 800 మీటర్ల ఫ్రీ స్టయిల్లో వచన్ రెండు రజత పతకాలను సాధించారని పేర్కొన్నారు.